క్లుప్తంగా

సచివాలయం తనిఖీ



సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రామానాయక్

గాండ్లపెంట: సోమయాజులపల్లి సచివాలయాన్ని ఎంపీడీఓ రామానాయక్ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని రికార్డులను, సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. అలాగే మూమ్‌మెంట్ రిజిస్టర్‌ను పరిశీలించి సిబ్బంది ఎక్కడ ఉన్నారో ఆరా తీశారు. సచివాలయానికి వచ్చే లబ్ధిదారులకు త్వరితగతిన సేవలు అందించాలని సిబ్బందిని ఆదేశించారు.

వంక పోరంబోకు భూమి గుర్తింపు



భూమిని సర్వే చేస్తున్న అధికారులు

తలుపుల : మండలంలోని కొరుగుట్టుపల్లి సమీపంలో సర్వే నంబర్ 885 లో 1.45 ఎకరాల భూమిని వంక పోరంబోకు భూమిగా గుర్తించినట్లు శనివారం ఆర్ఐ శ్రీనివాస్ తెలిపారు. కొరుగుట్టుపల్లికి చెందిన రైతులు తమ పొలాలకు దారి సౌకర్యం కల్పించాలని ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ కార్యాలయం నుంచి ఇరిగేషన్, రెవెన్యూ శాఖ వారికి భూమిని కొలతలు వేయాలని ఆదేశాలు అందాయి. ఈ మేరకు అధికారులు సర్వే చేపట్టారు. ఓ వ్యక్తి సర్వే నంబర్ 885 పక్కన పట్టా భూమిని కొనుగోలు చేసి మామిడి తోట సాగు చేసి, పక్కనున్న పోరంబోకు భూమిని ఆక్రమించుకొని, అందులో రేకుల షెడ్డు, రెండు బోర్లు వేసి, మామిడి చెట్లు నాటినట్లు గుర్తించారు. ఇరిగేషన్ డీఈ నీలిమ, ఏఈ ప్రతాప్, పోలీసుల సమక్షంలో హద్దులను గుర్తించామని ఆర్ఐ శ్రీనివాస్ తెలిపారు.

8న ఎరికల సంఘం ర్యాలీ



మాట్లాడుతున్న ఎరుకల సంఘం నాయకుడు గుజ్జల సురేష్

చెన్నేకొత్తపల్లి: ఆంధ్రప్రదేశ్ ఎరికల ప్రజా పోరాట సమితి ఆధ్వర్యంలో ఈనెల 8న జిల్లా కేంద్రంలో చేపట్టనున్న ర్యాలీని విజయవంతం చేయాలని సంఘం నాయకులు పిలుపునిచ్చారు. చెన్నేకొత్తపల్లిలో ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జల సురేష్ శనివారం విలేకరులతో మాట్లాడుతూ సత్యమ్మ ఆలయం వద్ద నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ సాగుతుందన్నారు. ఎరికల ఆరాధ్య దైవం ఏకలవ్య జయంతిని అధికారికంగా నిర్వహించాలని, మరికొన్ని ఇతర డిమాండ్లతో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎరికల శంకర్, రుద్ర,పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణతో అధిక దిగుబడులు



వేరుశనగ సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

కొత్తచెరువు: రైతులు వేరుశెనగ పంటలో సస్యరక్షణలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ జాన్సన్, శాస్త్రవేత్త రామసుబ్బయ్య తెలిపారు. శనివారం మండలంలోని కొడపగానిపల్లి రైతు సేవా కేంద్రంలో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు వేరుశనగ రకాలు, విత్తనశుద్ధి, ఎరువుల యాజయాన్యంపై రైతులకు అవగాహన కల్పించారు. వేరుశనగ విత్తుకోవడానికి ఈ నెలాఖరు వరకూ సమయం ఉందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అలివేలమ్మ, మండల వ్యవసాయాధికారి నటరాజ్, వీఏఓ కౌశిక్ తదితరులు పాల్గొన్నారు.

మట్టిలారీ బోల్తా



లారీ బోల్తాపడిన దృశ్యం

చెన్నేకొత్తపల్లి: మట్టి లారీ బోల్తా పడిన ఘటన మండల పరిధిలో 44వ నంబరు జాతీయ రహదారిపై శనివారం చోటుచేసుకుంది. సిమెంటు తయారీలో ఉపయోగించే మట్టిని పెనుకొండ వైపు నుంచి తాడిపత్రి వైపు రవాణా చేస్తుండగా ఎన్ఎస్‌గేట్ వై జంక్షన్ వద్ద అతి వేగం కారణంగా అదుపు తప్పి బోల్తా పడింది. ట్యాంకు ధ్వంసం కావడంతో డీజిల్ నేలపాలైంది. ఈ ప్రమాదంతో కొద్దిసేపు వాహన సంచారానికి అంతరం ఏర్పడింది. చెన్నేకొత్తపల్లి పోలీసులు జేసీబీ సాయంతో లారీని, మట్టిని తొలగింపజేశారు.

టీకాతో జూనోసిస్ వ్యాధుల నివారణ



బత్తలపల్లిలో పెంపుడు కుక్కకు టీకా వేస్తున్న డాక్టర్ చంద్రశేఖర్



పెంపుడు కుక్కకు టీకా వేస్తున్న డాక్టర్ శ్రీరాంనాయక్

బత్తలపల్లి: టీకాతో జూనోసిస్ వ్యాధులను నివారించవచ్చని పశుశాఖ ధర్మవరం డివిజన్ ఉప సంచాలకులు బి.చంద్రశేఖర్, డీడీ చంద్రశేఖర్ పేర్కొన్నారు. శనివారం స్థానిక పశువైద్యశాలలో ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా 63 పెంపుడు కుక్కలకు యాంటీ రేబీస్ టీకాలు డాక్టర్ యం.శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఉచితంగా వేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ పశువులు, కుక్కలు నుంచి మానవాళికి సంక్రమించే వ్యాధులును జూనోటిక్ వ్యాధులంటారన్నారు. ఈ విధంగా రేబీస్, బ్రూసెల్లోసిస్, అంత్రాక్స్, ప్లేగు, ఏబోలా, లెప్టస్పిరోసిస్, బర్డ్ ఫ్లూ, ఎన్సఫలిటీస్ మొదలైన వ్యాధులు సంక్రమిస్తాయన్నారు. వీటి పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. పెంపుడు కుక్కలుకు యాంటీ రేబీస్ టీకాలు వేశారు. కార్యక్రమంలో డాక్టర్ గుర్నాథరెడ్డి, సురేష్‌నాయక్, పశుశాఖ సహాయకులు పాల్గొన్నారు.

పుట్టపర్తి టౌన్: జంతువుల నుంచి మనుషులకు వివిధ రకాల వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని, తప్పనిసరిగా పెండు జంతువులకు యాంటీ రేబీస్ టీకాలు వేయించుకోవాలని పశువైద్య సంచాలకుడు డాక్టర్ శ్రీరామ్ నాయక్ సూచించారు. ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా పుట్టపర్తి ప్రాంతీయ పశువైద్యశాలలో శనివారం పెంపుడు జంతువులకు యాంటీ రేబీస్ టీకాలు ఉచితంగా వేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జంతువుల నుంచి మనుషులకు చాలా వాధ్యులు వ్యాపించే అవకాశం ఉందన్నారు. వాటి నివారణకు తప్పనిసరిగా టీకాలు వేయించుకోవాలన్నారు. శనివారం నుంచి 10 రోజుల పాటు పశువైద్యశాలలో ఉచితంగా టీకాలు వేస్తామన్నారు. కార్యక్రమంలో ఈశ్వర్‌నాయక్, లక్ష్మీపతితోపాటు వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

రేపు వైఎస్సార్ జయంతి

తలుపుల : దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి కార్యక్రమం సోమవారం ఉదయం 9 గంటలకు స్థానిక వైఎస్సార్ విగ్రహం వద్ద నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఫయాజ్ అహమ్మద్ ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో మండలంలోని వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజలందుకున్న శ్రీలక్ష్మీనరసింహస్వామి

తాడిమర్రి: ఏకపాదంపల్లి, నార్శింపల్లి గ్రామాల్లోని లక్ష్మీనరసింహస్వామి ఆలయాల్లో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆయా ఆలయాల్లోని పూజారులు స్వామి మూలవిరాట్‌లకు వెండి ఆభరణాలు తొడిగి, పలు రకాల పూలమాలలతో అందంగా అలంకరించి పూజలు చేపట్టారు. అలాగే తాడిమర్రి, నిడిగల్లు గ్రామాల్లోని లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయాల్లో కూడా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామికి కొబ్బరి కాయలు సమర్పించి మొక్కులు తీర్చు కున్నారు. అనంతరం ఆయా ఆలయాల్లో పూజారులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

న్యాయమూర్తిని కలిసిన న్యాయవాదులు



న్యాయమూర్తి మన్మథరావును సన్మానిస్తున్న న్యాయవాదులు

హిందూపురం అర్బన్: ఉమ్మడి అనంతపురం జిల్లా పరిపాలనా న్యాయమూర్తి కె.మన్మథరావును శనివారం అనంతపురంలో స్థానిక బార్ అసోసియేషన్ ప్రతినిధులు కలిశారు. బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రాజశేఖర్, శ్రీనివాసరెడ్డి, సీనియర్ న్యాయవాది సిద్ధు కలిసి హిందూపురం కోర్టుల్లో నెలకొన్న సమస్యలపై వినతిపత్రం అందజేశారు. హిందూపురంలోని కోర్టుల్లో పూర్తిస్థాయిలో న్యాయమూర్తులను నియమించాలని కోరారు. త్వరలోనే ఆయా పోస్టులను భర్తీ చేసేందుకు తనవంతు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారని బార్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు.

సర్పంచ్ కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ



రామచంద్ర కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి అర్బన్: ఇటీవల గుండె పోటుతో మృతి చెందిన అమగొండపాళ్యం సర్పంచ్ రామచంద్రనాయుడు కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పరామర్శించారు. జగనన్న ఓటమితో రామచంద్రనాయుడుమనోవైదనకు గురై మృతి చెందిన విషయం విధితమే. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే ఎంపీపీ ఏవీ రమణారెడ్డి, మండల కన్వీనర్ నరసారెడ్డి, ఎంపీటీసీ కుల్లాయప్ప, మాజీ సర్పంచ్ ఈశ్వరయ్య, మాజీ కన్వీనర్ గంగాద్రి, తదితర నాయకులతో కలిసి మృతుడి కుటుంబ సభ్యులను ధైర్యం చెప్పారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

మృతురాలికి దుద్దుకుంట నివాళి

నల్లమాడ: చౌటకుంటపల్లి ఎస్సీ కాలనీకి చెందిన జి. రామక్క(60) గుండెపోటుతో శనివారం తెల్లవారుజామున మృతి చెందింది. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి రామక్క మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థికసాయం అందించారు. స్థానిక నాయకులు పీవీ భాస్కర్‌రెడ్డి, శివారెడ్డి, కే. భాస్కర్‌రెడ్డి, వై. మోహన్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, క్రిష్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓడీచెరువు: పెద్దగుట్లపల్లికి చెందిన మాజీ ఎంపిటీసి మలక అశ్వర్థరెడ్డి మాతృమూర్తి లక్ష్మమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకొని మాజీ ఎంఎల్ఏ దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి శనివారం గ్రామానికి చేరుకుని లక్ష్మమ్మ మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ శ్రీనివాస రెడ్డి, వైఎస్సార్‌సీపీ మైనారిటీ సెల్ రాష్ట్ర కార్యదర్శి షామీర్‌బాషా, సర్పంచులు జగన్‌మోహన్ చౌదరి, తొట్లి రంగారెడ్డి, నాయకులు లక్ష్మిరెడ్డి, గోవర్దన్ రెడ్డి, హరినాథరెడ్డి, కుర్లి నర్సిరెడ్డి, రంగారెడ్డి, రఘు, జానీబాషా తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించండి



కేజీబీవీలో భోజనం నాణ్యతను పరిశీలిస్తున్న ఎంఈఓ సుధాకర్‌నాయక్

బత్తలపల్లి: విద్యార్థినులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఎంఈఓ సుధాకర్‌నాయక్ కస్తూర్బా బాలికల విద్యాలయం సిబ్బందికి సూచించారు. సంజీవపురం సమీపంలోని కేజీబీవీని ఎంఈఓ శనివారం అకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా సిబ్బంది, విద్యార్థుల వారీగా హాజరుతో పాటు అడ్మిషన్లు, స్టాక్ రికార్డులను ప్రిన్సిపాల్ గుల్జార్ బేగంను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థినులతో పలు అంశాలపై ఆరా తీశారు. బోధన ఏవిధంగా సాగుతోందని, అలాగే ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. విద్యార్థినులకు తరగతుల వారీగా షెడ్యూల్ ప్రకారం బోధన సాగాలని ఆదేశించారు. విద్యార్థినులకు నాణ్యమైన అల్పాహారం, భోజనం అందించాలన్నారు. తాగునీటితో పాటు మరుగుదొడ్లు, వంటగది, విద్యాలయ ప్రాంగణం పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. ఆయన వెంట సీఆర్‌యం టీ సునీతతో పాటు కేజీబీవీ బోధన, బోధనేతర సిబ్బంది ఉన్నారు.

నీట్ పరీక్ష రద్దు చేయాలని నిరసన



నిరసన ర్యాలీ చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

ధర్మవరం అర్బన్: కేంద్ర ప్రభుత్వం నీట్ పరీక్షను రద్దు చేయాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి నిరంజన్‌యాదవ్ డిమాండ్ చేశారు. పట్టణంలో శనివారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం నిరంజన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నీట్ పరీక్షను రద్దు చేయాలని ఉద్యమించినా పట్టించుకోవడంలేదన్నారు. ఎన్‌టీఏ సంస్థను రద్దు చేసి కేంద్ర విద్యాశాఖమంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు అయినప్పటి నుంచి విద్యా వ్యవస్థ పూర్తిగా నాశనమవుతోందన్నారు. నూతన జాతీయ విద్యా విధానం పేరుతో పాఠశాలల మూసివేయడం సిగ్గుచేటన్నారు. నీట్‌ను రద్దు చేసి అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు సాయినాథ్‌రెడ్డి, సభ్యులు నవీన్, మాధవ్, హనుమాన్, సాయిప్రణీత్, సాయినాథ్‌గౌడ్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

కనుమ వేంకటేశ్వరస్వామికి పూజలు



అలంకరణలో స్వామివారు

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని పైలబోయలపల్లి గ్రామ సమీపంలో కొండల నడుమ వెలసిన కనుమ శ్రీ వేంకటేశ్వర స్వామికి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామివారి మూలవిరాట్‌కు అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

పోరాటాలతోనే కార్మిక సమస్యల పరిష్కారం



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

తాడిమర్రి: పోరాటాలతోనే కార్మిక సమస్యలు పరిష్కారమవుతాయని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేష్ పేర్కొన్నారు. స్థానిక ఎస్సీ కాలనీలోని ఆర్డీటీ పాఠశాలలో శనివారం నూతన సీఐటీయూ మండల కమిటీ ఎన్నిక నిర్వహించారు. సీఐటీయూ మండల కన్వీనర్‌గా పీ.వెంకటేష్, కో కన్వీనర్లుగా బీ.భారతి, లక్ష్మీనారాయణ (పతి), కమిటీ సభ్యులుగా జయలక్ష్మీ, ప్రభావతి, ఆదెమ్మ తదితరులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, ఆటో డ్రైవర్లు, క్షేత్ర సహాయకులు, ఆశా కార్యకర్తలు, భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. అలాగే ఈనెల 10న జరగనున్న కోర్కెల దినం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. సీఐటీయూ నాయకులు మహేశ్వర్‌రెడ్డి, పద్మావతి, సాయిలీల, రాములమ్మ, సాంబశివుడు, లింగమయ్య, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ వర్ధంతి



జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కదిరి టౌన్: పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో శనివారం కాంగ్రెస్ ఎస్సీ విభాగం జిల్లా చెర్మన్ కదిరిప్ప ఆధ్వర్యంలో జగ్జీవన్ రామ్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు జగ్జీవన్ రామ్ దేశానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు తిప్పన్న, భాస్కర్, నాగరాజు, గంగాద్రి తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటిస్తే డయేరియా దూరం



హరియాన్‌చెరువు గ్రామంలో అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

చెన్నేకొత్తపల్లి: జాగ్రత్తలు పాటించడం ద్వారా డయేరియాకు దూరంగా ఉండవచ్చని వైద్య సిబ్బంది ప్రజలకు వివరించారు. ఎన్ఎస్ గేట్ పీహెచ్‌సీ సిబ్బంది శనివారం హరియాన్ చెరువు గ్రామంలో పర్యటించారు. గర్భిణులు, చిన్నారులకు వ్యాధినిరోధక టీకా వేశారు. డయేరియాపై అవగాహన కల్పించారు. భోజనానికి ముందు చేతులు శుభ్రం చేసుకోవాలన్నారు. అనంతరం ఓఆర్ఎస్ పాకెట్లు అందజేశారు. మేడాపురం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు చేతుల శుభ్రతపై అవగాహన కల్పించారు. హెల్త్ అసిస్టెంట్లు వెంకటేష్, విష్ణువర్ధన్, ఏఎన్ఎంలు సుజాత, అశ్విని, ఎంఎల్‌హెచ్‌పీ ఝాన్సీ, ప్రధానోపాధ్యాయుడు గురుమూర్తి, ఉపాధ్యాయులు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేయాలి



ధర్నా చేస్తున్న నాయకులు

ముదిగుబ్బ: మండల కేంద్రంలో పాలిటెక్నిక్ కళాశాలను ఏర్పాటు చేయాలని బీసీ విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ పాఠశాల వద్ద శనివారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి నారాయణస్వామి మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే పెద్ద మండలంగా ఉన్న ముదిగుబ్బలో పాలిటెక్నిక్ కళాశాలను ఏర్పాటు చేస్తే ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఫెడరేషన్ డివిజన్ అధ్యక్షుడు రాఘవేంద్ర, రవి, రాజేశస్, నిశాంత్ తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన ఖాద్రీ ఆలయం



దర్శనం కోసం క్యూలో భక్తులు

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం అర్చకులు శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీనరసింహుడిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేపట్టారు. కదిరి పరిసరాల ప్రాంతాల నుంచే కాకుండా కర్ణాటక, చిత్తూరు, కడప, అనంతపురం జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. మహిళలు ఆలయం ముంగిట దీపాలు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. అధికారులు భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదానం నిర్వహించారు.

మండల సర్వసభ్య సమావేశం వాయిదా

గాండ్లపెంట: ఈ నెల 9న జరగవలసిన మండల సర్వసభ్య సమావేశం వాయిదా వేసినట్లు ఎంపీడీఓ రామానాయక్ శనివారం తెలిపారు. 9న అనంతపురంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఉన్నందున సమావేశాన్ని వాయిదా వేశామన్నారు. తిరిగి 11న సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు గమనించాలని కోరారు.

జీఓ 117 రద్దు చేయాలి



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు రవీంద్రరెడ్డి

ధర్మవరం అర్బన్: జీవో 117ను రద్దు చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు సానే రవీంద్రరెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం 117 జీవోను రద్దు చేయాలని తెలిపారు. మున్సిపల్ పాఠశాలలకు విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని, అప్‌గ్రేడ్ అయిన ఉన్నత పాఠశాలలకు ఉపాధ్యాయ పోస్టులు కేటాయించాలన్నారు. జీఓ 55 ప్రకారం ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్లను కేటాయించాలని, బోధనేతర కార్యక్రమాల నుంచి ఉపాధ్యాయులను తప్పించి అన్ని రకాల యాప్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అన్ని ఉన్నత పాఠశాలల్లో తెలుగు, ఇంగ్లిష్ మీడియంను సమాంతరంగా కొనసాగించాలన్నారు. ఉపాధ్యాయుల బదిలీల్లో రాజకీయ జోక్యం లేకుండా నివారించేందుకు బదిలీల చట్టం రూపొందించాలని కోరారు. 2024 డీఎస్సీ నోటిఫికేషన్‌లో అప్రెంటీస్ విధానం లేకుండా చూడాలని, మున్సిపల్ ఉపాధ్యాయుల పీఎఫ్ సమస్యపై మున్సిపల్ అధికారులు నిబంధనలు రూపొందించాలని డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్ పట్టణాధ్యక్షుడు శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి జగదీష్, సభ్యులు నాగభూషణ, వెంకటేష్, అమానుల్లా, చెన్నుడు, అంజినాయక్, చంద్రశేఖర్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

'రాహుల్‌గాంధీ లోక్‌సభ సభ్యత్వం రద్దు చేయాలి'



రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వీహెచ్‌పీ సభ్యులు, బీజేపీ నాయకులు

ధర్మవరం అర్బన్ : హిందువులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన రాహుల్‌గాంధీ లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు చేసి కఠినంగా శిక్షించాలని విశ్వహిందూ పరిషత్ విభాగ్ కార్యదర్శి పులిచెర్ల వేణుగోపాల్ డిమాండ్ చేశారు. పట్టణంలో శనివారం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ చేపట్టి ఆర్డీఓ వెంకట శివరామిరెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ సమావేశాల్లో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ హిందువులను హింసవాదులుగా, అసత్య వాదులుగా ఇతరులపై దాడి చేసేవారిగా అవమానకరంగా మాట్లాడారన్నారు. ఈ వ్యాఖ్యలను హిందూ సమాజం ముక్తకంఠంతో ఖండించాలని తెలిపారు. బీజేపీ నాయకులు అంబటి సతీష్, జింకా చంద్రశేఖర్, గుండా పుల్లయ్య, వీహెచ్‌పీ సభ్యులు పాలిశెట్టి వెంగముని, దేవరకొండ రామానుజులు, పులిచెర్ల శ్రీహరి, దాసరి హరి, శంకర్ నరసింహుడు, గణేష్, చింతా తిరుపతయ్య, ప్రవీణ్, శివాజి, జింకా ప్రవీణ్, దేవాలయ కమిటీలు, భజన సంఘాలు, కుల సంఘాలు, వినాయక ఉత్సవ కమిటీల సభ్యులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

పెనుకొండ రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ బోయ అనిల్ (34) మృతి చెందాడు. వివరాల్లోకెళితే... మునిమడుగుకు చెందిన అనిల్ రెండు రోజుల క్రితం ద్విచక్ర వాహనంలో వ్యక్తిగత పనుల నిమిత్తం గుట్టూరుకు వెళ్లాడు. తిరిగి గ్రామానికి వెళ్తుండగా మార్గమధ్యలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి తీవ్రంగా గాయపడ్డాడు. బెంగళూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రం చనిపోయాడు. కియా పోలీసులు శనివారం ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని శవానికి పెనుకొండ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. మృతునికి తల్లి, భార్య నందిని ఉన్నట్లు ఎస్ఐ రంగడు తెలిపారు.

తుంగభద్ర నీటి విడుదలకు అంతరాయం

పావగడ: తుంగభద్ర తాగునీటి విడుదలకు అంతరాయం ఏర్పడింది. చళ్లకెరెకు సుమారు 15 కి.మీ దూరంలో తుంగభద్ర జలాలు సరఫరా అయ్యే పైపు పగిలి పోవడంతో నీరు లీకేజీ అవుతోంది. దీంతో శనివారం పావగడకు చేరుకోవాల్సిన నీటికి అంతరాయం ఏర్పడింది. వెంటనే పైపులకు మరమ్మతు చేయించి రెండు మూడు రోజుల్లో తుంగభద్ర జలాలు పావగడకు వచ్చే విధంగా చూస్తామని నీటిపారుదలశాఖ బసవశింగప్ప తెలిపారు.